క్లుప్తంగా

ఇన్‌చార్జి ఎంపీవోగా జీవన్‌రెడ్డి

నేరడిగొండ: నేరడిగొండ మండల ఇన్‌చార్జి ఎంపీవోగా జీవన్‌రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీవో శోభన సెలవులపై వెళ్లడంతో బోథ్ ఎంపీవోగా విధులు నిర్వహిస్తున్న జీవన్‌రెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగించారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పర్యటించడంతో పాటు గ్రామాల అభివృద్ధికి పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు ముందుండాలని సూచించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

కంటి వెలుగు సద్వినియోగం చేసుకోవాలి

నేరడిగొండ: అంధత్వ నివారణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వడూర్ సర్పంచ్ గాదె సమత అన్నారు. సోమవారం మండలంలోని వడూర్‌లో కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పండరి, పంచాయతీ కార్యదర్శి నర్సారెడ్డి, మండల ఆరోగ్య పర్యవేక్షకులు రాంనరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రీమియర్ లీగ్ నిర్వహించడం అభినందనీయం

ఆదిలాబాద్: క్రికెట్ క్రీడాకారులను ప్రోత్సహించే విధంగా ప్రీమియర్ లీగ్ నిర్వహించడం అభినందనీయమని జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న జూనియర్ ప్రీమియర్ లీగ్ పోటీలకు సోమవారం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడాకారుల ఇటువంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం మ్యాచ్‌లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారుడికి మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అందజేశారు. కార్యక్రమంలో లీగ్ నిర్వాహకులు జయేంద్ర పటాస్కర్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

ఇంద్రవెల్లి: గ్రామీణ ప్రజలు, యువత సైబర్ నేరాలకు దూరంగా ఉండాలని ఇంద్రవెల్లి ఎస్సై సునీల్ అన్నారు. సోమవారం సాయంత్రం మండలంలోని దనోర(బి) గ్రామానికి సందర్శించి సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై భీంరావ్, సర్పంచ్ యేర్మ జాకేశ్వర్ పాల్గొన్నారు.

పాండురంగ్ సేవలు చిరస్మరణీయం

ఇచ్చోడ: ఇచ్చోడ ఎఫ్‌ఆర్‌వోగా విధులు నిర్వర్తించి హఠాన్మరణం చెందిన పాండురంగ్ సేవలు చిరస్మరణీయమని డీఎఫ్‌వో చంద్రశేఖర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎఫ్‌డీవో కార్యాలయంలో సంతాపసభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాండురంగ్ ఉద్యోగ రీత్యా మంచి సేవలు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో ఇచ్చోడ ఎఫ్‌డీవో బర్నోబా, ఎంపీపీ ప్రీతంరెడ్డి, ఉప సర్పంచ్ లోక శిరీష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు పకడ్బందీగా నిర్వహించాలి

బజార్‌హత్నూర్: మండలంలో ఉపాధిహామీ పనులను పకడ్బందీగా నిర్వహించాలని జెడ్పీటీసీ మల్లేపూల నర్సయ్య తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో ఉపాధిహామీ పనులను పరిశీలించారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ పని కల్పించాలన్నారు. ప్రతీవారం పనికి తగిన కూలీడబ్బులు చెల్లించాలని సూచించారు. బోగస్ జాబ్‌కార్డులను తొలగించాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అండగా ఉంటాం

నేరడిగొండ: క్రీడాకారులకు అండగా ఉంటూ తమవంతు ప్రోత్సాహం అందజేస్తామని ఉద్యోగాలు పొందిన సీనియర్ క్రీడాకారులు అన్నారు. నేరడిగొండ ప్రీమియర్ లీగ్ (ఎన్‌పీఎల్) 4 విజయవంతం కోసం తమవంతుగా కృషి చేస్తామన్నారు. జూనియర్ ఆటగాళ్లను ప్రోత్సహించేందుకు సోమవారం నేరడిగొండ క్రికెట్‌క్లబ్ వారికి రూ.30వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ సభ్యులు యోగి, మణిరాజ్, గణేశ్ మురళీ, సిద్ధూ, గణేశ్, పవన్, నరేశ్, ప్రదీప్ పాల్గొన్నారు.

శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

ఇచ్చోడ: వివిధ కోర్సుల్లో శిక్షణ పొందిన మహిళలు ఉపాధి పొంది, శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి అన్నారు. జనశిక్షణ సంస్థాన్ ఆధ్వర్యంలో మూడు నెలల పాటు ఉచిత శిక్షణ పొందిన మహిళలకు సోమవారం మండల కేంద్రంలో ధ్రువపత్రాలు అందచేశారు. టైలరింగ్, కంప్యూటర్, బ్యూటీషన్ కోర్సులలో శిక్షణ పొందిన మహిళలు స్వశక్తితో ఆర్థికంగా ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. సర్పంచ్ సునీత, ఉపసర్పంచ్ లోక శిరీష్‌రెడ్డి, జనశిక్షణ సంస్థ అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్ సంతోశ్, రాజు పాల్గొన్నారు.

జోరందుకున్న జొన్న కోతలు

- అకాల వర్షాలతో కొంత ఆలస్యం
- యంత్రాలపై ఆధారపడుతున్న రైతులు



ఆరబెట్టిన జొన్నపంట



జొన్న పంట కోస్తున్న హార్వెస్టర్

తాంసి: మండలంలో జొన్నపంట కోతలు కొంత ఆలస్యంగా ప్రారంభమైన ప్రస్తుతం ఉపందుకున్నాయి. రైతులు సాగుచేసిన జొన్నపంట అంతా ఒకే సారి కోతకు రావడంతో హార్వెస్టర్ యంత్రాలకు సైతం డిమాండ్ పెరిగింది. ప్రస్తుతం మండల వ్యాప్తంగా ఏపంటచేలలో చూసిన యాసంగి సీజన్‌లో సాగుచేసిన జొన్నపంట నూర్పిడి చేయిస్తూ రైతులు బిజీగా బిజీగా ఉన్నారు. ఆయా గ్రామాల్లో జొన్న పంట చేతికి వచ్చిన ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దిగుబడిపై ప్రభావం..

ఇటీవల కురిసిన అకాల వర్షాలు రైతులను నట్టేట ముంచాయి. కోత దశకు వచ్చిన జొన్నపంటను అకాల వర్షాలు తీవ్రంగా దెబ్బతీశాయి. పంట నేల కొరగడంతో పలుచోట్ల మొలకెత్తాయి. కోతకు వచ్చిన పంట రంగు మారడంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపింది. మరో వైపు పంటచేలలో వర్షపు నీరు నిలవడంతో నూర్పిడి చేద్దామంటే హార్వెస్టర్ యంత్రాలు పంటచేలలో కురుకుపోయే పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం వర్షాలు తగ్గి వాతావరణం అనుకూలంగా ఉండడంతో హార్వెస్టర్ యంత్రాలతో జొన్నపంట కోతలు చేపడుతున్నారు.

5వేల ఎకరాల్లో సాగు..

తాంసి, భీంపూర్ ఉమ్మడి మండలంలోని 39 పంచాయతీల్లో మొత్తం 5వేల ఎకరాలకు పైగా జొన్న సాగు చేసినట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. ప్రస్తుతం పంట కోతలు ఊపందుకున్నాయని, ఇప్పటి వరకు 40శాతం నుంచి 50శాతం వరకు కోతలు పూర్తయినట్లు అంచనా వేస్తున్నారు. అకాల వర్షాల వలన ఇప్పటికే పంట దెబ్బతిని రైతులు నష్టపోయారు. యంత్రాలకు ఎకరానికి రూ.5వేల వరకు చెల్లించడంతో రైతులు మరింత ఆర్థికంగా నష్టపోతున్నారు. జొన్నలను తేమశాతం తగ్గే వరకు ఆరబెట్టి నిల్వ చేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

ఆలస్యంగా జొన్న కోత



ఎనిమిది ఎకరాల్లో జొన్న పంట సాగుచేశాను. అకాల వర్షాలు వరుసగా కురవడంతో పంట కోయలేని పరిస్థితి నెలకొంది. వర్షం కారణంగా పంటచేల్లో నీరు నిలిచి బురదమయంగా మారింది. దీంతో జొన్న పంట కోత ఆలస్యం అయింది. ప్రస్తుతం నాలుగేకరాల్లో పంట కోశాను. ఇంకా కోయాల్సి ఉంది.

– రాహుల్ రెడ్డి, యువరైతు, తాంసి

కొనసాగుతున్న కోతలు



మండల వ్యాప్తంగా ఈయాసంగి సీజన్‌లో రైతులు 5వేల ఎకరాల్లో జొన్న పంట సాగు చేశారు. అకాల వర్షాల వలన పలు గ్రామాల్లో జొన్న పంట దెబ్బతింది. దెబ్బతిన్న జొన్న పంట రైతుల వివరాలను గ్రామాలవారీగా నమోదు చేసుకున్నాం. ప్రస్తుతం జొన్నపంట కోతలు కొనసాగుతున్నాయి.

–రవీందర్, ఏవో, తాంసి

సమస్యల పరిష్కారంలో ఎమ్మెల్యే విఫలం

ఇంద్రవెల్లి: ఖానాపూర్ నియోజకవర్గంలోని సమస్యలు పరిష్కరించడంలో ఎమ్మెల్యే విఫలమయ్యారని ఏఐసీసీ రీసెర్చ్ డిపార్టుమెంట్ రాష్ట్ర కోఆర్డినేటర్ వినోద్‌నాయక్ ఆరోపించారు. సోమవారం మండలంలోని వడగామ్ గ్రామానికి సందర్శించి, తాగునీటి కోసం మహిళలు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. గ్రామాలకు భగీరథ నీరు రాక, మంచినీటి పథకాలు పని చేయక రెండు కిలోమీటర్ల దూరం నుంచి నీటిని తీసుకువస్తున్నారని తెలిపారు. నీటి సమస్య విషయం ఎమ్మెల్యే రేఖనాయక్‌కు తెలిసినా.. పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సోమోరే నాగోరావ్, ఉత్తమ్, రమేశ్, మహిపాల్, కమిత, కల్యాణ్, భావరాజ్, తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న వినోద్‌నాయక్

ఏజెంట్లతో రైతులు మోసపోవద్దు

గుడిహత్నూర్: ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతుండడంతో వివిధ సంస్థల ఏజెంట్లు స్కీంల పేర రైతులను మోసగించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని మండల వ్యవసాయాధికారి రేవతి అన్నారు. సోమవారం మండలంలోని రాగాపూర్, గోండ్ హర్కాపూర్, బెల్లూరి, చింతగూడ, ధరమడుగు, గ్రామాల్లో రైతు అవగాహన కార్యక్రమాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. ఆఫర్లతో విత్తనాలు, ఎరువులు విక్రయించడానికి వస్తే వెంటనే సంబంధిత ఏఈవోలకు సమాచారం ఇవ్వాలన్నారు. లైసెన్సు దుకాణాల్లో మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు చేసిన వెంటనే రశీదు తీసుకోవాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఏఈవోలు శ్రీధర్, స్రవంతి, సాయి ప్రణీత్, వంశీ, రైతులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

పలు గ్రామాల్లో భారీ వర్షం

- ఎగిరిపోయిన ఇళ్ల పైకప్పులు
- విరిగిపడిన వృక్షాలు.. విద్యుత్ స్తంభాలు

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులతో వడగామ్, వాల్గొండ, జెండగూడ, కేస్లాగూడ, మల్లాపూర్, అంద్‌గూడ, లింగపూర్, పోల్లుగూడ, పాకిడిగూడ, మోడిగూడ గ్రామాల్లోని ఇళ్లపై కప్పులు లేచిపోయాయి. భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు విరిగి పడడంతో గ్రామాల్లో అంధకారం నెలకొంది. రెవెన్యూ అధికారులు ఆయా గ్రామాలను సందర్శించి నష్టాన్ని అంచనా వేశారు.



కేస్లాగూడలో నేలకొరిగిన వృక్షం

కార్మిక హక్కుల కోసం పోరాడుదాం

ఎదులాపురం: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు పర్స సత్యనారాయణ స్ఫూర్తితో కార్మిక హక్కుల కోసం పోరాడుదామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో సోమవారం పర్స సత్యనారాయణ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 19 ఏళ్లకే గూడెం సింగరేణి కార్మిక ఉద్యమంలో ప్రవేశించి అనేక పోరాటాలు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న, ఉపాధ్యక్షుడు గంగన్న, పుష్ప, చంద్రకళ, రామన్న, తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న అన్నమొల్ల కిరణ్

పారిశుధ్యంపై దృష్టి సారించాలి

నార్నూర్: పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎల్‌పీవో భిక్షపతిగౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని తాడిహత్నూర్ గ్రామంలో చేపడుతున్న పారిశుధ్య పనులను ఎంపీవో స్వప్నశీలతో కలిసి పరిశీలించారు. గ్రామాల్లో పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వచ్చేది వర్షకాలం కాబట్టి శానిటేషన్‌తో పాటు వర్షపు నీరు నిలువ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

గొప్ప దార్శనికుడు భాగ్యరెడ్డి వర్మ

ఆదిలాబాద్‌రూరల్: అణగారిన, అంటరాని ప్రజల సమానత్వం కోసం జీవితాంతం పోరాడిన గొప్ప దార్శనికుడు భాగ్యరెడ్డి వర్మ అని మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు అల్లూరి భూమన్న అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో భాగ్యరెడ్డి వర్మ 135వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, దేవిదాస్, ప్రశాంత్, సాయిబాబా, వీరప్రసాద్, వెంకటయ్య పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు

ఆదిలాబాద్‌టౌన్: శ్రీరాం సిటీ యూనియన్ ఫైనాన్స్, ప్రథమ్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఆటోమెటీవ్ టూవీలర్ (బైక్ మెకానిక్)లో శిక్షణ ఇచ్చి, ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ కాలంలో భోజనం, వసతి కల్పించడం జరుగుతుందన్నారు. 75 రోజుల పాటు హన్మకొండలోని ఆరెపల్లిలో శిక్షణ ఉంటుందని, 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు గల వారు అర్హులని తెలిపారు. ఈనెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 63094 89485 సంప్రదించాలని కోరారు.

పరామర్శ

బోథ్: మండలంలోని సొనాల గ్రామానికి చెందిన నారాయణ తల్లి మృతి చెందడంతో ఎంపీపీ తుల శ్రీనివాస్ సోమవారం పరామర్శించారు. సొనాలలో సంతోశ్, కుచులాపూర్‌లో సురుగల భోజారెడ్డి తల్లి ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. మర్లపెల్లి గ్రామానికి చెందిన ఇంటలిజెన్స్ అధికారి తుకారాం తల్లి మరణించడంతో ఎంపీపీ శ్రీనివాస్‌తో పాటు తెలంగాణ అధ్యాపకులు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్‌లు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

ఆదిలాబాద్: పార్టీ బలోపేతం కోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసిని రెడ్డి అన్నారు. ఇటీవల పార్టీ మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమితులైన షేక్ ముఖీమ్ అహ్మద్‌ను సోమవారం జిల్లా కేంద్రంలోని ఆమె నివాసంలో ఘనంగా సన్మానించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో గటిక క్రాంతికుమార్, తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులే మొదటి గురువులు

ఆదిలాబాద్: ప్రపంచానికి మొదటి గురువులు తల్లిదండ్రులని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని బాలకేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన తల్లిదండ్రుల పాద పూజ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ముందుగా నటరాజమూర్తి, సరస్వతి దేవి చిత్రపటాలకు పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన నృత్యం ఆకట్టుకుంది. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చిన్నారులు తమ తల్లిదండ్రులు, గురువులను గౌరవించాలన్నారు. కార్యక్రమంలో బాల కేంద్రం పర్యవేక్షకుడు మిట్టు రవి, చిన్నారుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు బస్‌పాస్‌లు

ఉట్నూర్‌రూరల్: ఆర్టీసీ ఆధ్వర్యంలో దివ్యాంగులకు బస్‌పాస్ మేళా నిర్వహించారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్వహించిన మేళాలో దివ్యాంగులకు బస్‌పాస్‌లు అందించడం జరిగిందని ఆర్టీసీ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌చార్జి జనార్దన్, సీఐ జనరల్ జీకేమూర్తి, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

జైనథ్: మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం ఉదయం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో గజానన్ రావ్ తెలిపారు. వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికలతో సమావేశానికి హాజరు కావాలని కోరారు. ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్ అధ్యక్షతన నిర్వహించనున్న సమావేశానికి జెడ్పీటీసీ తుమ్మల అరుంధతి వెంకట్‌రెడ్డి, హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి

- మున్సిపల్ ఛైర్మన్ జోగు ప్రేమేందర్

ఆదిలాబాద్‌టౌన్: ప్రజారోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని ఆదిలాబాద్ మున్సిపల్ ఛైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పుత్లీబౌళి పట్టణ ఆరోగ్య కేంద్రంలో జన ఆరోగ్య సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజారోగ్య సంరక్షణకు ముందడుగు వేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఆదిశగా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. పేదలకు నాణ్యమైన వైద్యం అందించడమే ముఖ్య ఉద్దేశమన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల కాలనీల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన, మెడికల్ ఆఫీసర్ ఆఫియ ఫాతిమా, అర్బన్ రెసిడెన్షియల్ ప్రత్యేకాధికారి ప్రశాంత్ రెడ్డి, సీఈవో నవీన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్ జోగు ప్రేమేందర్

'గడప గడపకూ కాంగ్రెస్'

ఆదిలాబాద్‌టౌన్: కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం గడప గడపకూ కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణంలోని భగత్ సింగ్ నగర్ కాలనీలో ఇంటింటికీ తిరుగుతూ వరంగల్ రైతు డిక్లరేషన్, హైదరాబాద్ యూత్ డిక్లరేషన్‌కు గురించి ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నగేశ్ కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిందని ఆరోపించారు. బీజేపీ హయాంలో నిత్యావసర సరుకులు, పెట్రోల్ ధరలు నింగిని అంటుతున్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు మహ్మద్ సాబిర్, రాహుల్, దత్తు, ఫెరోజ్, వెంకటి, జాకీర్ పాల్గొన్నారు.



ప్రజలకు వివరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

'కార్పొరేట్'లో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

- జూన్ 3 వరకు కొనసాగనున్న ప్రక్రియ
- గత ఏడాది జిల్లాలోని 64 మంది విద్యార్థులకు అవకాశం

ఆదిలాబాద్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ.. పదో తరగతిలో 7 జీపీఏకు పైగా సాధించిన విద్యార్థులకు కార్పొరేట్ కళాశాలల్లో ఇంటర్ కోర్సు ఉచితంగా అభ్యసించే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగానే ఈనెల 22 నుంచి జూన్ 3వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. పదో తరగతిలో సాధించిన జీపీఏ, రిజర్వేషన్లను పరిగణలోకి తీసుకొని వారికి ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి అవకాశం కల్పించనున్నారు. విద్యార్థుల ఫీజును ప్రభుత్వమే కళాశాల యాజమాన్యాలకు చెల్లిస్తుంది.

అర్హులు వీరే..

పదో తరగతి పరీక్షల్లో 7 జీపీఏకు పైగా సాధించిన విద్యార్థులు అర్హులు. ప్రభుత్వ వసతిగృహాల్లో ఉంటూ.. చదివిన జెడ్పీ, ఎయిడెడ్, కేజీబీవీ, నవోదయ, గురుకులాలు, ఆదర్శ పాఠశాలలు, బెస్ట్ అవైలబుల్ పథకం కింద చదివిన విద్యార్థులు ఉచిత కార్పొరేట్ విద్య కోసం దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయపత్రాన్ని దరఖాస్తుతో జత చేయాలి. గ్రామీణ ప్రాంతాల వారికి రూ. 1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రూ. 2 లక్షలు వార్షికాదాయం మించరాదు. కుల, స్థానిక ధ్రువపత్రాలు జత చేయాలి. దివ్యాంగులు వైకల్యానికి సంబంధించిన ధ్రువపత్రం అందజేయాలి.

దరఖాస్తు విధానం

మీ సేవా కేంద్రాల ద్వారా టీఎస్‌ఈపాస్ పోర్టల్‌లోని దరఖాస్తు పత్రంలో విద్యార్థి పూర్తి వివరాలు, పదో తరగతిలో సాధించిన జీపీఏ ధ్రువీకరణతో పాటు ఇతర ధ్రువీకరణ పత్రాలు, ఫోన్ నంబర్, ఈమెయిల్ ఐడీ, విద్యార్థి పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో స్కాన్ చేసి జత చేయాలి. నాలుగు నుంచి పదో తరగతి వరకు విద్యార్థులు చదివిన పాఠశాలల నుంచి తీసుకున్న ధ్రువీకరణ పత్రం జత చేయాల్సి ఉంటుంది.

మొక్కజొన్నను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది

నేరడిగొండ: రైతులు పండించిన మొక్కజొన్నను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని ఎంపీపీ రాథోడ్ సజన్ అన్నారు. బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు ఆదేశాల మేరకు కుమారి క్లస్టర్‌లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. క్వింటాలు ధర రూ.1962 ఉన్నట్లు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు దళారులకు పంటను అమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్ మందుల రమేశ్, సర్పంచ్ రాజు యాదవ్, ఎంపీటీసీ సవిత చంద్రశేఖర్ యాదవ్, వీడీసీ ఛైర్మన్ శంకర్, గడ్డం భీంరెడ్డి, అల్లూరి శివారెడ్డి, తర్నం సర్పంచ్ విశాల్, నరేశ్‌రెడ్డి పాల్గొన్నారు.



మొక్కజొన్న కొనుగోళ్లను ప్రారంభిస్తున్న ఎంపీపీ

చెక్కు అందజేత

బోథ్: బోథ్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సభ్యురాలు జ్యోతి ఇటీవల మృతి చెందారు. కాగా పార్టీ సభ్యత్వ బీమా ఉండడంతో రూ. 2 లక్షల చెక్కును ఎమ్మెల్యే బాపురావు ఆదిలాబాద్‌లోని తన నివాసంలో భర్త రమణగౌడ్‌కు అందజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, సర్పంచ్ సురేందర్ యాదవ్, ఆత్మ ఛైర్మన్ సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

బోథ్: మండలంలోని కౌఠ గ్రామానికి చెందిన సంతోశ్‌కు రూ.22 వేల విలువైన చెక్కును ఎంపీపీ తుల శ్రీనివాస్ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం అందజేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ పేదవారికి అండగా ఉంటుందన్నారు. ఆయన వెంట నాయకులు మల్లెపూల రమేశ్, మహిపాల్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సీతక్కకు సన్మానం

నేరడిగొండ: ములుగు ఎమ్మెల్యే సీతక్కను అప్పిల్' స్వచ్ఛంద సంస్థ ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ సెరికల్చర్ లైసెన్ ఆఫీసర్ రాథోడ్ పార్వతి సన్మానించారు. ఆదివారం రాత్రి ఆమె నివాసంలో కలిసి తమ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చేపట్టే సేవా కార్యక్రమానికి హాజరు కావాలని ఆహ్వానించారు. ఆమె మాట్లాడుతూ.. బోథ్ నియోజకవర్గంలోని దళిత, గిరిజన, బీసీ, మైనారిటీలోని పేదలకు సంబంధించిన సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.



సన్మానిస్తున్న సభ్యులు

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠాపన

తాంసి: భీంపూర్ మండలంలోని అర్లి(టి) గ్రామంలో నూతనంగా నిర్మించిన రేణుక ఎల్లమ్మ ఆలయంలో సోమవారం భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించారు. గత రెండు రోజులుగా ఆలయ ప్రాంగణంలో హోమం, అర్చన, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం ఉదయం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. నేరడిగొండ జెడ్పీటీసీ అనిల్ జాదవ్, భీంపూర్ జెడ్పీటీసీ సుధాకర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచ్ రమ లస్మన్న, ఎంపీటీసీ రాకేశ్, నితిన్, ఉల్లాస్, తిరుమల్ రెడ్డి, అఫ్రోజ్, స్వామి పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న జెడ్పీటీసీలు అనిల్, సుధాకర్